



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

జిల్లాలో శాంతిభద్రతలు లోపిస్తున్నాయి

- పోలీసుల సమక్షంలో టీడీపీ కార్యకర్తపై దాడి
- గ్యాంగ్‌స్టర్ నయీం అవతారమెత్తిన అహ్మద్‌బాషా
- డిప్యూటీ సీఎం సోదరుని జిల్లా బహిష్కరణ చేయాలి
- జిల్లా ఎస్పీని కలిసిన టీడీపీ నేతలు
- ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తాం : టీడీపీ

కడప (క్రైం), ఫిబ్రవరి 9 : డిప్యూటీ సీఎం అంజద్‌బాషా సోదరుడు గ్యాంగ్‌స్టర్‌గా అవతారమెత్తాడని, హైదరాబాదులో గతంలో నయీం చేసిన తరహాలో కడప ప్రజలను, మైనార్టీలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని.. అతనిపై కేసులు నమోదు చేసి నగర బహిష్కరణ చేయాలని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరోసభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు కడప టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి, జమ్మలమడుగు ఇన్‌చార్జ్ భూపేష్‌రెడ్డి, ప్రొద్దుటూరు ఇన్‌చార్జ్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నేత గోవర్ధనరెడ్డితో కలిసి ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌ను కలిసి వైసీపీ నేతలు, మంత్రి సోదరుడిపై ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ డిప్యూటీ సీఎం అంజద్ బాషా, ఆయన సోదరుడు అహ్మద్‌బాషా కుటుంబసభ్యుల అగడాలకు అంతు లేకుండాపోయిందన్నారు. గురువారం కడపలో జరిగిన సంఘటన చూస్తే వీరి ఆగడాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతుందన్నారు. టీడీపీ ముస్లిం మైనార్టీ కార్యకర్తలపై మంత్రి సోదరుడు, వైసీపీ కార్యకర్తలు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. తమ కార్యకర్త ఆరీఫుల్లా, 70 ఏళ్ల వయసున్న అతని తండ్రిపై పోలీసుస్టేషన్‌లోనే దాడి చేస్తుంటే.. సీఐ కళ్లు మూసుకుని కూర్చున్నారని విమర్శించారు. తమ కార్యకర్తలనే కాకుండా పోలీసులపై దుర్భా షలాడుతున్నా వారు స్పందించకపోవడం దారుణమన్నారు. మీడియా ఎదుట అహ్మద్‌బాషా పత్రికలలో రాయలేని విధంగా దుర్భాషలాడారని.. అతని వ్యాఖ్యలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జరిగిన సంఘటనపై ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తామన్నారు. పది పదిహేను రోజుల్లో ఎన్నికల షెడ్యూలు రానున్న సందర్భంలో జనాలను భయపెట్టేందుకే వైసీపీ నాయకులు ఇలా రెచ్చిపోతున్నారని.. వీరి చేష్టలకు ఎవరూ భయపడేది లేదని స్పష్టం చేశారు. టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలపై పోలీసు స్టేషన్‌లోనే దాడికి తెగబడిన డిప్యూటీ సీఎం సోదరుడు అహ్మద్ బాషాపై కేసులు నమోదు చేసి నగర బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా జిల్లాలో టీడీపీకి ఆదరణ పెరగడంతో గొడవలు సృష్టిస్తున్నారన్నారు. ప్రొద్దుటూరు ఇన్‌చార్జ్ ఉక్కు ప్రవీణ్ మాట్లాడుతూ జిల్లాలో టీడీపీ అంటే వైసీపీకి భయం పట్టుకుందన్నారు. సీఎం, ఎమ్మెల్యేలకు ఓటమి భయంతో డిప్రెషన్‌లోకి వెళ్లారని, రౌడీలు, పోలీసులు సమాజంలో వ్యతిరేకం కానీ.. ఇక్కడ తమాషా ఏంటంటే వైసీపీ రౌడీలు పోలీసులను అడ్డుపెట్టుకుని వేధించే ప్రక్రియలో తాడేపల్లి నుంచే ముఖ్యమంత్రే ఈ తతంగం నడిపిస్తున్నారని ఆరోపించారు. పోలీసు కార్యాలయంలోకి మీడియా మిత్రులు వస్తుంటే ఎందుకు ఆపుతున్నారో అర్థం కావడం లేదన్నారు. తాము ఏమైనా టెర్రరిస్టులమా, లేక నక్సలైట్లమా అని ప్రశ్నించారు. ఎస్పీ కార్యాలయానికి వచ్చి ఎవరైనా వచ్చి ఫిర్యాదు చేసుకోవచ్చు. కానీ తాము లోపలికి వెళుతుంటే మీడియా ఉంటే.. అనుమతించమంటూ గేట్లు బయట పెట్టడం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. ఇది ఎస్పీ ఆఫీసా, లేక దొంగల కార్యాలయమా? లేక మేము ఏమన్నా దొంగలమా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఇదేనా.. మెగా డీఎస్సీ!



- అదరాబాదరాగా డీఎస్సీ నోటిఫికేషన్
- ఉమ్మడి కడప జిల్లాలో 289 ఖాళీల భర్తీ
- టెట్, డీఎస్సీ వెంట వెంటనే నిర్వహించడంపై అభ్యంతరం
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న అభ్యర్థులు

ప్రభుత్వం డీఎస్సీకి సంబంధించి ఉమ్మడి కడప జిల్లాలో 289 పోస్టులను కేటాయించింది. ఇందులో సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జీటీ) 105, స్కూలు అసిస్టెంట్లు (ఎస్‌ఏ) 81, టీజీటీ 103 మొత్తం 289 పోస్టులను కేటాయించింది.



కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 9: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. దీంతో డీఎస్సీ పోస్టుల భర్తీ కోసం నాలుగున్నర సంవత్సరాలు నిరీక్షించినా ఎటువంటి ప్రకటన లేదు. ఇక ఎన్నికలు వస్తున్నాయి... ఇచ్చిన హామీ నెరవేర్చలేదన్న అపవాదు మూట కట్టుకో వాల్సి వస్తుందని అదరాబాదరాగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారు. అయితే ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ పోస్టులను చూసిన నిరుద్యోగ ఉపాధ్యాయులు తీవ్ర నిరాశ చెందారు. ఇంత కాలం ఎదురు చూసింది.. ఈ సంబరానికేనా అంటూ మండిపడు తున్నారు. దీనికి తోడు ప్రభుత్వం తగినంత వ్యవధి ఇవ్వకుండా టెట్ డీఎస్సీ నిర్వహించేందుకు సిద్ధం కావడంపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేర్వేరు సిలబస్ అయినందున రెండు పరీక్షల మధ్యకాస్త సమయం ఉండాలని.. వెంటనే వెంటనే నిర్వహిస్తే.. ఎలా చదువుకోవాలంటూ ప్రశ్నిస్తున్నారు.

టెట్, డీఎస్సీ పరీక్షల సిలబస్ వేర్వేరుగా ఉంటుంది. టెట్‌లో ఉత్తీర్ణులైన వారే డీఎస్సీ రాసేందుకు అర్హులు. ఉపాధ్యాయ నియామకాల్లో టెట్ మార్కులకు 20 శాతం వరకు వెయిటేజీ ఉంటుంది. దీంతో డీఎస్సీ రాసే అభ్యర్థులకు టెట్ అత్యంత కీలకమని చెప్పాలి. అందువల్ల టెట్, డీఎస్సీ పరీక్షల మధ్య సమయం ఇవ్వకుంటే ఎలా అని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఈ నెల 27న టెట్, వచ్చే నెల 15 నుంచి డీఎస్సీ నిర్వహించనున్నారని ఇంత తక్కువ వ్యవధిలో రెండు పరీక్షలకు ఎలా సిద్ధం కాగలమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరేళ్ల తరువాత నిర్వహించనున్న డీఎస్సీకి తీవ్ర పోటీ ఉన్నందున అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా ప్రిపేర్ కావాలంటే తగినంత సమయం ఉండాలని విద్యా మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రెండు పరీక్షల మధ్య తగినంత సమయం ఇవ్వకుంటే అభ్యర్థులు తీవ్ర వత్తిడికి గురవుతారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో టెట్, డీఎస్సీ పరీక్షల మధ్య తగినంత సమయం ఉండేలా ప్రభుత్వం డీఎస్సీ షెడ్యూలులో మార్పులు చేయాలని కోరుతూ కొందరు న్యాయస్థానం ఆశ్రయించనున్నట్లు సమాచారం. అలాగే డీఎస్సీలో పోస్టులు కూడా పెంచాలని కోరుతున్నారు.

టెట్ షెడ్యూలు ఇలా...

టెట్‌కు హాజరు కానున్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరణ గురువారం నుంచి ప్రారంభమైంది. ఈ నెల 18లోగా దరఖాస్తులు చేసుకోవాలి. 27 నుంచి మార్చి 9 వరకు రాత పరీక్షలు నిర్వహిస్తారు. ఫలితాలను మార్చి 14న విడుదల చేస్తారు. అయితే సాధారణంగా టెట్ పరీక్ష ఫలితాలు వెలువడిన తరువాత డీఎస్సీ పరీక్షల షెడ్యూలు ఖరారు చేయాలి. రెండు పరీక్షల మధ్య నెల నుంచి 45 రోజులు వ్యవధి ఉండాలి. కానీ వైసీపీ ప్రభుత్వం అందుకు భిన్నంగా నిర్ణయం తీసుకుందని చెప్పాలి.

డీఎస్సీ షెడ్యూలు ఇలా...

ఈ నెల 7న రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిపికేషన్ విడుదల చేసింది. పరీక్ష కంప్యూటర్ బేస్డ్ ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఉంటుంది. పరీక్ష ఫీజు ఈనెల 12 నుంచి 21వ తేదీ లోగా చెల్లించాలి. హాల్‌టికెట్లను మార్చి 3వ తేదీ నుంచి జారీ చేస్తారు. పరీక్షలను మార్చి 15 నుంచి 30 తేదీ లోపు నిర్వహిస్తారు. తుది ఫలితాలను 7వ తేదీ ప్రకటిస్తారు.

రాష్ట్ర విభజన అనంతరం మూడో డీఎస్సీ

రాష్ట్ర విభజన తరువాత ఇది మూడో డీఎస్సీ ప్రకటన. 2014లో టీడీపీ ప్రభుత్వం తొలిగా డీఎస్సీ ప్రకటించింది. భర్తీ ప్రక్రియ కూడా పూర్తి చేశారు. 2017లో టీడీపీ ప్రభుత్వం మళ్లీ డీఎస్సీ ప్రకటించినా.. కొన్ని కారణాలతో వాయిదా వేశారు. అనంతరం 2018లో టీడీపీ ప్రభుత్వం మళ్లీ డీఎస్సీ ప్రకటించింది. ఎన్నికలు రావడంతో మధ్యలోనే డీఎస్సీ ప్రక్రియ నిలిచిపోయింది. అయితే వైసీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రతి సంవత్సరం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని నిరుద్యోగులకు హామీ ఇచ్చింది. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్ల పూర్తయినా ఇంత వరకు డీఎస్సీ ప్రకటించకపోవడం అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమైంది. ఎన్నికలు వస్తున్నాయి. ఇచ్చిన హామీ నెరవేర్చలేదన్న ఆలోచనలతో అదరాబాదరాగా ప్రభుత్వం అతితక్కువ పోస్టులతో డీఎస్సీ ప్రకటించింది. దీనిపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో కాలంగా డీఎస్సీ కోసం ప్రిపేరవుతున్న తమకు వైసీపీ ప్రభుత్వం నిరాశ కలిగించిందని చెబుతున్నారు.

టెట్‌కు డీఎస్సీకి వ్యవధి ఉండాలి..



టెట్ ఫలితాలు వెలువడిన తరువాతే డీఎస్సీ పరీక్ష షెడ్యూలు ఖరారు చేయాలి. రెండు పరీక్షల మధ్య కనీసం నెలా 15 రోజులైనా వ్యవధి ఉండాలి. కానీ ఈప్రభుత్వం దానికి భిన్నంగా నిర్ణయం తీసుకుంది. వ్యవధి ఉండేలా మరోసారి ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

- కిశోర్‌నాయక్, వేంపల్లె మండలం, పీ.కే.పల్లె గ్రామం

రెండేళ్ల శ్రమ వృథా..



ఎంతోకాలంగా డీఎస్సీ వస్తుందని శిక్షణ పొందుతున్నాం. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ నిరాశ కలిగించింది. పోస్టులు లేవు, కనీసం టెట్, డీఎస్సీకి మధ్య కూడా గడువు లేకపోవడం దౌర్భాగ్యం, మేం ఇంత వరకు పడిన శ్రమంతా వృథా అయింది.

శివాజీనాయక్, అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం

మెగా డీఎస్సీ ప్రకటించాలి..



ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించాలి. లేదంటే ఉద్యమిస్తాం. గత ఐదేళ్ల నుండి డీఎస్సీ ప్రకటన వెలువడుతుంది.. తాము ఎంతో కష్టంతో తీసుకున్న శిక్షణకు ఫలితం దక్కుతుందని ఎదురు చూస్తే వైసీపీ ప్రభుత్వం అతి తక్కువగా డీఎస్సీ పోస్టులు ప్రకటించింది. నిరుద్యోగ ఉపాధ్యాయులు మాత్రం వేల సంఖ్యలో ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25వేల ఉపాధ్యాయ పోస్టులను మెగా డీఎస్సీ పేరుతో ప్రకటించాలి.

- కోడూరు మల్లిఖార్జున, ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

పోస్టులు పెంచాలి..



వైసీపీ ప్రభుత్వం మెగా డీఎస్సీ విడుదల చేస్తామని ఊరించి చివరికి అతి తక్కువ పోస్టులతో డీఎస్సీ ప్రకటించింది. దీనివల్ల వేల సంఖ్యలో ఉన్న నిరుద్యోగ ఉపాధ్యాయులకు ఈ పోస్టులు ఏ మాత్రం సరిపోవు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి డీఎస్సీ పోస్టులు పెంచాలి.

- నరేష్, రేణిగుంట

కన్నులపండువగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



కడప (కల్చరల్), ఫిబ్రవరి 9: తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవుని కడపలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల అంకురార్పణ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం 6 గంటలకు కన్నుల పండువగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఈనెల 9 నుంచి 19 వరకు ఘనంగా జరుగనున్నాయి. అందులో భాగంగా మొదటి రోజు ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రోచ్ఛారణలతో స్వామివారి ఆలయం నుంచి ప్రత్యేక పల్లకిని పుష్కరిణి వద్దకు తీసుకెళ్లి పూజలు గావించారు. అక్కడ నుంచి పుట్టమట్టిని తెచ్చి ఆలయంలో బీజావహనం చేశారు. ఆలయ అధికారులు నటేష్‌బాబు, ఈశ్వర్‌రెడ్డి, అర్చకులు క్రిష్ణమోహన్‌తో పాటు పలువురు భక్తు లు పాల్గొన్నారు. తదుపరి రాత్రి 8 గంటలకు సేనాపతి ఉత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు.



సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా రాత్రి 7 గంటలకు హరికథ ఏర్పాటు చేశారు. కాగా, శనివారం ఉదయం 10-30 గంటలకు ఆలయంలో తిరుచ్చి ధ్వజారోహణముతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.



మెగా డీఎస్సీ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కడప కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

పర్యాటకానికి 'గండి'

గండికోట కత్తుల కోనేరు ఎండిపోయే దిశగా కొద్దిగా ఉన్న నీరు



లోయ వద్దకు వెళ్లే దారిలో నిరుపయోగంగా మారిన నీళ్ల పైపులు, ట్యాంకులేని దిమ్మె



పర్యాటక కేంద్రానికి వచ్చి నీళ్లకోసం క్యాన్ పట్టుకుని వెళుతున్న దృశ్యం



- గండికోటను పట్టించుకోని పాలకులు
- నీటి వసతి సైతం కల్పించని దుస్థితి
- నిరుపయోగంగా మరుగుదొడ్లు
- వైసీపీ ప్రభుత్వంలో పర్యాటకం నిర్వీర్యం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 9: పర్యాటక ప్రాంతమైన గండికోటను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. చారిత్రక ప్రాధాన్యం ఉన్న కట్టడాలు, కనువిందుచేసే పెన్నాలోయ ఉన్న గండికోటకు నిత్యం పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. శని, ఆదివారాల్లో అయితే రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక నుంచి సైతం పర్యాటకులు వస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న గండికోటను వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా ఏమాత్రం పట్టించుకోలేదు. ఇక్కడ కనీస వసతులు కల్పించలేదు.

జమ్మలమడుగు మండల కేంద్రం నుంచి గండికోట సుమారు 12 కి.మీ. దూరంలో ఉంది. గతంలో కంటే పర్యాటకుల తాకిడి పెరిగింది. పేరుకే ఇది కోట కానీ.. ఇక్కడ సౌకర్యాలకు గండిపడిందని పర్యాటకులు, స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఇవీ సమస్యలు..

- గండికోట ముందు భాగంలో పర్యాటకులు వచ్చే వాహనాలను పెట్టుకోవడానికి పార్కింగ్ సౌకర్యం లేదు. కోట ముందు భాగంలో రోడ్డు పక్కన దుకాణాలు, హోటళ్లు వెలిశాయి. టీడీపీ హయాంలో గండికోట ఉత్సవాలు నిర్వహించే సమయంలో రోడ్డుకు ఇరువైపుల ఖాళీ స్థలాలు ఉండేవి. ప్రస్తుతం రోజురోజుకూ ఇక్కడ నిర్మాణాలు వెలుస్తున్నాయి. దీంతో వాహనాల పార్కింగ్‌కు స్థలం లేకుండా పోయింది.
- లోయ పక్కన టూరిజం సంబంధించిన టెంట్లు పర్యాటకులకు సౌకర్యంగా ఉన్నప్పటికీ నీటి వసతి తీవ్ర సమస్యగా మారింది. లోయ పక్కన పర్యాటకులు కూర్చోవడానికి వసతి ఏర్పాటు చేయాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.
- గండికోటలోని జుమ్మా మసీదు ఎదురుగా కత్తుల కోనేరు ఏడాది నుంచి నీళ్లు లేక ఎండిపోయే దశకు వచ్చింది.
- కోట ముందు భాగంలో ధాన్యాగారం ఎదురుగా పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి.



జుమ్మా మసీదు ఎదురుగా పర్యాటకుల సందడి

- కోటలో మంచినీటి సౌకర్యం కూడా లేదు. ఎదురుగా మంచినీటి పైపులు ఉన్నప్పటికీ అక్కడే ఉన్న సింటెక్స్ ట్యాంకు ఏర్పాటు చేయలేదు. దీంతో ఇక్కడకు వచ్చే పర్యాటకులు కొందరు తమవెంట క్యాన్లు తెచ్చుకుంటున్నారు. కొంతమంది నీటి దప్పిక తీర్చుకోవడానికి తిరిగి గ్రామంలోకి వెళ్లి వాటర్ బాటిళ్లు కొనాల్సి వస్తోంది.
- లోయ దగ్గర విద్యుత్తు స్తంభం చుట్టూ ముళ్లపొదలు పెరిగిపోయాయి. ఆ ప్రాంతంలో పర్యాటకులకు భద్రత లేదు.
- రంగనాథస్వామి దేవాలయం ఎదురుగా, ధాన్యాగారం సమీపాన పర్యాటకుల కోసం వసతి ఏర్పాటు చేయాలని కోరుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. వీటి ఎదురుగా రాళ్ల, కంకర దర్శనమిస్తున్నాయి.
- ప్రస్తుతం గండికోటలో ఇష్టారాజ్యంగా ఎలాంటి అనుమతులు లేకున్నా రిసార్ట్‌లు వెలిసినట్లు ఆరోపణలున్నాయి. వాటి సమీపాన ఉన్న ఖాళీ స్థలాల్లో వాటి సొంతదారులు అనుమతి లేకుండానే టెంట్లు వేసి పర్యాటకుల నుంచి డబ్బులు తీసుకుంటున్నారు.

ఈ సమస్యలకు సంబంధించి స్థానిక సర్పంచ్ గురు ఈశ్వర్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా గండికోటలో మంచినీరు లేక ఎల్లమ్మ దేవాలయం వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నారని అన్నారు. నాలుగురోజుల క్రితం బోరు వేశామని, ఆ బోరు నుంచి నీరు సరఫరా అవుతుందో లేదో చూడాల్సి ఉందన్నారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఇటీవల కొంత నిధులు విడుదల చేసిందని, బిల్లులు పెట్టుకుందామంటే అధికారులు పలకడం లేదని అన్నారు.



ముళ్లపొదల మధ్య ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



బోటు వద్దకు వెళ్లే దారి అధ్వాన్నం

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- క్రిటికల్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ దిశా నిర్దేశం



కడప (క్రైం), ఫిబ్రవరి 9: రానున్న సార్వత్రిక ఎన్నికలకు పోలీసు అధికారులు, సిబ్బంది సర్వసన్నద్ధం కావాలని, ఎలాంటి ఘటనలకు తావు లేకుండా ముందస్తు ప్రణాళికలతో బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో కడప, కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గాల పోలీసు అధికారులు, సిబ్బందికి ఎన్నికల నేపథ్యంలో కార్యాచరణ ప్రణాళికపై ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడ్డ వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. మద్యం, నగదుతో ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ట్రబుల్ మాంగర్లు, రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. గ్రామాల ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకుని సమస్యల గురించి ముందస్తు సమాచారం సేకరిస్తుండాలన్నారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు వెంటనే ఉన్నతాధికారులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్, ఏఆర్ అదనపు ఎస్పీ క్రిష్ణారావు, కడప డీఎస్పీ ఎండీ షరీఫ్, సీఐలు, ఎస్ఐలు, సెక్టార్ పోలీసు అధికారులు, స్పెషల్ బ్రాంచ్, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో ఐదుగురికి జైలు శిక్ష

ముద్దనూరు ఫిబ్రవరి 9: స్థానిక ఎల్ఎం కాంపౌండ్‌లోని సీఎస్ఐ చర్చి వద్ద ఎనిమిది సంవత్సరాల క్రితం జరిగిన హత్య కేసుకు సంబంధించి నేరం రుజువు కావడంతో శుక్రవారం ప్రొద్దుటూరు కోర్టు ఐదుగురికి జైలు శిక్ష విధించినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. సీఐ వివరాల మేరకు... 2016 సంవత్సరంలో సీఎస్ఐ చర్చి మేనేజ్‌మెంట్ చేస్తున్న బోనం రాజారత్నంను చర్చి ఖజానాకు సంబంధించి కొంత మంది చర్చి సభ్యులు వివరాలు అడుగగా.. మీకు సంబంధం లేదన్నారు. అయితే 2016 ఫిబ్రవరి 7వ తేదీ చర్చి పెద్దమనుషుల ఎన్నికలు నిర్వహించగా.. మరో వర్గం వారు గెలుపొందారు. వీరు చర్చి ఖజానాకు సంబంధించి వివరాలు తెలపాలని చర్చి మేనేజ్‌మెంటు చేస్తున్న బోనం రాజారత్నం (67), బోనం సురేష్‌కుమార్(42), బోనం అనిల్‌కుమార్(37), బోనం రవి(57), తేలు అశోక్(32), బోనం దేవసహాయం, బోనం ధనరాజ్‌లు చర్చి ఎన్నికల్లో గెలుపొందిన వారిపై కత్తులతో దాడి చేశారు. ఈదాడిలో ఉదయ్‌కుమార్(27) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ కేసుకు సంబంధించి ప్రొద్దుటూరు కోర్టులో విచారణ జరుగుతూ వచ్చింది. 8 సంవత్సరాల తరువాత జైలు శిక్ష విధిస్తూ కోర్టులో తీర్పు వచ్చింది. బోనం దేవసహాయం, ధనరాజ్ ఇప్పటికే మృతి చెందగా.. ఏ1 ముద్దాయి బోనం సురేష్, ఏ6 బోనం రవికి యావజ్జీవ కారాగారం, ఏ2 తేలు అశోక్, ఏ3 బోనం అనిల్‌కుమార్, ఏ4 బోనం రాజారత్నంకు 3 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.1.50 లక్షలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

కలెక్టర్ ఆర్డీవో కార్యాలయ సందర్శన



కలెక్టర్ విజయరామరాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్డీవో

జమ్మలమడుగు, ఫిబ్రవరి 9: జమ్మలమడుగు రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్ని శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ విజయ రామరాజు ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా ఆర్డీవో శ్రీనివాసులుతో మాట్లాడారు. స్ట్రాంగ్‌రూంను పరిశీలించారు. అనంతరం 2024 సార్వత్రిక ఎన్నికలకు రెవెన్యూ డివిజన్ పరిధిలో సిద్ధంగా ఉన్నారా తదితర అంశాలపై చర్చించినట్లు ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. పోలింగ్ స్టేషన్లు, ఓటర్ల లిస్టు, పోలింగ్ కేంద్రాల్లో సమస్యలుంటే ఈనెల 10వ తేదీలోగా పరిష్కరించాలని ఆదేశించినట్లు ఆర్డీవో తెలిపారు. జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో గూడెం చెరువు టిడ్కో గృహాల వద్ద రిజిస్ట్రేషన్లకు సంబంధించి కలెక్టర్ అడిగినట్లు ఆర్డీవో విలేకరులకు తెలిపారు.

పోలీసు సిబ్బందికి వీక్లీ బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు



వీక్లీ బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు గ్రహీతలతో ఎస్పీ సిద్ధార్థ కౌశల్

కడప (క్రైం), ఫిబ్రవరి 9 : పోలీసు సిబ్బందిని ప్రోత్సహించే క్రమంలో జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి వీక్లీ బెస్ట్ ఫెర్మార్మెన్స్‌అవార్డును అందిస్తున్నారు. శుక్రవారం ముగ్గురు సివిల్, ఒక ఏఆర్ సిబ్బందిని ఎంపిక చేసిన నగదు రివార్డులు, ప్రశంసాపత్రం అందించి అభినందించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళుతున్న రూ.31.5 లక్షల నగదును స్వాధీనం చేసుకోవడంలో మైదుకూరు పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ వై.రమేష్‌బాబు కీలక పాత్ర వహించారు. ఇటీవల ప్రొద్దుటూరులో గోవా మద్యం స్వాధీనంలో కీలక పాత్ర వహించిన రాజుపాలెం పీఎస్ హెడ్ కానిస్టేబుల్ కె.నాగాంజనేయులు, ప్రొద్దుటూరు వన్‌టౌన్ పీఎస్ హెడ్ కానిస్టేబుల్ డి.బాబాఫక్రుద్దీన్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ప్రశంసాపత్రం, నగదు రివార్డులు అందించారు. డీసీఆర్‌బీలో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ టీఎస్ పెద్దిరాజును ఎస్పీ అభినందించారు. నాన్ బెయిలబుల్ వారెంట్లు, లోక్‌అదాలత్, ఎలక్షన్ సెల్ విధుల్లో అత్యుత్తమ పనితీరు కనబరచడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో సిబ్బంది మున్ముందు విధులు నిర్వహించాలని ఎస్పీ ఆకాంక్షించారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు వీసీ ప్రశంసలు

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 9 : కేంద్ర ప్రభుత్వ గిరిజన వ్యవహారాల శాఖ నిర్వహించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల అధ్యాపక నియామక పరీక్షల్లో వైవీయూ తెలుగుశాఖ పరిశోధక విద్యార్థులు వెంకటయ్య, డాక్టర్ నరేష్ ఉద్యోగాలు పొందారు. వీరిని వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసరు ఎస్.రఘునాథరెడ్డి, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ ప్రొఫెసరు తప్పెట రాంప్రసాద్‌రెడ్డి , పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు ఎన్.ఈశ్వర్‌రెడ్డి, తెలుగుశాఖ అధ్యక్షురాలు ప్రొఫెసరు పార్వతి అభినందించారు. ఈ నెల 12న విశాఖలో జరిగే రోజ్‌గార్ మేళా అంతర్జాలం ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోడీ నుంచి నియామక పత్రాలు పొందనున్నామని వారు తెలిపారు. ఉద్యోగాలు పొందిన ఓ.వెంకటయ్య, డాక్టర్ నరేష్‌లను ఇతర పరిశోధక విద్యార్థులు అభినందించారు.

అంజన్నను దర్శించుకున్న జిల్లా విద్యాశాఖాధికారి



అంజన్న సన్నిధిలో జిల్లా విద్యాశాఖాధికారి

చక్రాయపేట, ఫిబ్రవరి 9: గండి వీరాంజనేయస్వామిని శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి అనూరాధ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన అర్చకుడు కేసరి, రఘుస్వామి పూజలు చేశారు. శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. ఆమె బాధ్యతలు చేపట్టిన అనంతరం గండి అంజన్నను దర్శించుకోవడం మొదటిసారి. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కోశాధికారి గంగవరపు శివారెడ్డి, బి. రంగారెడ్డి, చైతన్య స్కూల్ కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, ఉషాకిరణ్ స్కూల్ కరస్పాండెంట్ రమణారెడ్డి, ధర్మారెడ్డి, రమణ, ఎంఈఓ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మోపెడ్‌కు నిప్పంటించిన ఆగంతకులు



కాలిపోయిన మోపెడ్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 9: రాయచోటి పట్టణంలోని మహ్మద్‌పురా మసీదులో మౌజన్‌గా పనిచేస్తున్న యాకూబ్‌కు సంబంధించి టీవీఎస్ స్కూటర్‌కు గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. మసీదులో పనిచేసే మౌజన్ యాకూబ్ మసీదు బయట నిలిపి ఉంచిన మోపెడ్‌కు గుర్తు తెలియని దుండగులు నిప్పంటించారు. ఈ సంఘటనపై రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. కాగా, ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని పోలీసులు చెబుతున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత..



పట్టుబడిన ఆటోలో రేషన్ బియ్యం

రామాపురం, ఫిబ్రవరి 9: తరలించేందుకు సిద్ధంగా ఉన్న 12 ప్యాకెట్లలోని 480 కిలోల రేషన్ బియ్యాన్ని తహసీల్దార్ అరవింద కిశోర్, ఎస్ఐ వీఎల్ ప్రసాద్ రెడ్డి స్వాధీనం చేసుకున్నారు. మండల కేంద్రానికి చెందిన పఠాన్ బాబ్‌జాన్ గ్రామాల్లో బియ్యాన్ని కొనుగోలు చేసి వాటిని రాయచోటిలో విక్రయించేందుకు తీసుకువచ్చాడు. బియ్యం లోడు చేసిన ఆటో అతని ఇంటి వద్ద నిలిపి ఉండగా దాడి చేసి బియ్యంతోపాటు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆటో డ్రైవర్ బాబ్‌జాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

నిధుల దుర్వినియోగం కేసులో ఒకరి సస్పెన్షన్

నందలూరు, ఫిబ్రవరి 9: నందలూరు మండలం నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీలో నిధుల గోల్‌మాల్‌పై ఒకరిని సస్పెండ్ చేయగా మరొకరికి షోకాజ్ నోటీసు అందజేశారు. ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసిన అధికారులు 1.75లక్షల రూపాయల పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశాడంటూ బిల్ కలెక్టర్ పొలిచెర్ల నరసింహులును సస్పెండ్ చేశారు. జీతాల పేరుతో గోల్‌మాల్ చేశాడంటూ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ కాకమూరి నరసింహులుకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఈ మేరకు డీపీవో ధనలక్ష్మీ ఉత్తర్వులు జారీ చేసినట్లు పంచాయతీ సెక్రటరీ హరి నారాయణ తెలిపారు.

ప్రైవేటు ట్రావెల్స్‌లో జీఎస్‌టీ అధికారుల సోదాలు



ప్రైవేటుట్రావెల్స్‌లో తనిఖీచేస్తున్న జీఎస్‌టీ అధికారులు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 9 : ప్రొద్దుటూరు లోని ప్రైవేటు ట్రావెల్ కార్యాలయాలపై జీఎస్టీ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని వాసవి ట్రావెల్స్ లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పార్శిళ్లను పరిశీలించారు. వాటికి సరైన బిల్లులు వున్నది లేనిది విచారించారు. ప్రైవేటు ట్రావెల్స్‌లో నగదు రవాణా జరుగుతోందా అనే కోణంలో సైతం కూడా ఆరా తీశారు.

ప్రాంతీయ పార్టీలు బీజేపీకి బానిసలు : తులసిరెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి 9: రాష్ట్రానికి చెందిన ప్రాంతీయ పార్టీలు బీజేపీకి బానిసలుగా మారాయని ఏపీ కాంగ్రెస్‌మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి విమర్శించారు. శుక్రవారం వేంపల్లెలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ, టీడీపీ, జనసేనలు బీజేపీ చేతిలో కీలుబొమ్మలుగా మారడం శోచనీయమన్నారు. బీజేపీ రాష్ట్రానికి నెంబర్ 1 ద్రోహి అని అన్నారు. విభజన హామీలు నెరవేర్చకుండా అన్యాయం చేసిందన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మాలని చూస్తోందన్నారు. అటువంటి బీజేపీ ప్రాపకం కోసం ప్రాంతీయ పార్టీలు పాకులాడడం గర్హనీయమన్నారు. బీజేపీలో బీ అంటు బాబు, జే అంటే జగన్, పీ అంటే పవన్‌గా తయారయ్యాయని ఎద్దేవా చేశారు. రాబోవు ఎన్నికల్లో దుష్టచతుష్టయ పార్టీలను ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వేతనాలుపెంచాలని పనిభారం తగ్గించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆశా కార్యకర్తలు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే వారిపై వైసీపీ ప్రభుత్వం దుశ్శాసన పర్వం కొనసాగించడం దారుణమన్నారు.

గ్రాస్‌ల్యాండ్ కథ కంచికేనా?

- ప్రైవేటు వాహనాలకు పార్కింగ్‌గా మారిన స్థలం
- పట్టించుకోని పాలకులు, మున్సిపల్ అధికారులు



ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారిన గ్రాస్‌ల్యాండ్ స్థలం



2018లో ఆక్రమణలు తొలగించి వేసిన కంచె

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 9: పట్టణం మధ్యలోని గ్రాస్ ల్యాండు ఏడేళ్లైనా అభివృద్ధికి నోచుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఎన్‌కాలనీలో జాతీయ రహదారికి పక్కన సుమారు అర్ధ కిలోమీటరు పొడవునా గత 40 ఏళ్లుగా పలువురు దుకాణాలు నిర్వహించేవారు. వారి నుంచి ఆ కాలనీకి చెందిన పలువురు అద్దె వసూలు చేసుకునేవారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలన్న లక్ష్యంతో 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం గ్రాస్‌ల్యాండ్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలను, దుకాణాలను పూర్తి స్థాయిలో తొలగించి చుట్టూ కంచె ఏర్పాటు చేసింది. ఈ వ్యవహారం కొంత ఉద్రిక్త పరిస్థితులకు కూడా దారి తీసింది. అయితే, ఆక్రమణలు తొలగించి ఏడేళ్లు పూర్తవుతున్నా ఆ స్థలం అభివృద్ధికి నోచుకోలేదు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్లు పూర్తి కావస్తున్నా, ఆ పార్టీ పెద్దలు గ్రాస్ ల్యాండ్ అభివృద్ధిని గాలికి వదిలేసి, పట్టణ ప్రజలకు అందుబాటులో లేని ప్రాంతాల్లో అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్నారు. అందరికీ అందుబాటులో ఉన్న గ్రాస్‌ల్యాండ్ స్థలాన్ని అభివృద్ధి చేసి పార్కు ఏర్పాటు చేస్తే పట్టణ ప్రజలకు ఆహ్లాదరకమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని స్థానికులు చెబుతున్నా అధికార పార్టీ నేతలు పట్టించుకోవడం లేదు. ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారిన గ్రాస్ ల్యాండ్ స్థలాన్ని గాలికి వదిలేసి, డైట్ హాస్టల్ ఆక్రమించి అభివృద్ధి చేయడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికార పార్టీ నాయకులు ఓట్ల కోసం ఫీట్లు వేస్తున్నారా.. లేక ఎస్ఎన్‌కాలనీలోని తమ అనుచర వర్గానికి ఆ స్థలాన్ని అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న తమ కడుపులు కొట్టి ఏడేళ్లు గడుస్తున్నా ఇంతవరకు అక్కడ ఎటువంటి పనులు చేపట్టకపోవడంపై దుకాణదారులు, వ్యాపారులు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు గ్రాస్ ల్యాండ్ స్థలం అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కేంద్రం ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావును వివరణ కోరగా తాను ఈ మధ్యనే బాధ్యతలు స్వీకరించానని, . గ్రాస్‌ల్యాండ్‌ను ఏడేళ్లుగా ఎందుకు అభివృద్ధి చేయలేదో తమ సిబ్బందిని అడిగి తెలుసుకుంటానని, అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు.

ముస్లింలంతా టీడీపీ వెంటే..!

- 40 కుటుంబాలు టీడీపీలో చేరిక
- బీటెక్ రవి



బీటెక్ రవి, మునిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న ముస్లింలు

వేంపల్లె, ఫిబ్రవరి 9: ముస్లిం మైనార్టీలు ఎప్పుడు టీడీపీ వెంటే ఉన్నారని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి తెలిపారు. వేంపల్లెలోని నేదరవీధిలో సుమారు 40 ముస్లిం కుటుంబాలు శుక్రవారం సాయంత్రం టీడీపీలో చేరాయి. మండల టీడీపీ అధ్యక్షుడు రామమునిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఆధ్వర్యంలో ఆయన కండువా వేసి వారిని టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఢిల్లీ పెద్దలతో చంద్రబాబు మాట్లాడితే తప్పేంటని వైసీపీ నేతలను ప్రశ్నించారు. బీజేపీతో సంబంధాలు ఉన్నాయని, మైనార్టీలను టీడీపీ విస్మరిస్తోందని దుష్ప్రచారం చేయడం హాస్యాస్పదమన్నారు. రంజాన్ తోఫా, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు, హజ్ యాత్ర, దుల్హన్ పథకం, విదేశీ విద్య, షాదీఖానా నిర్మాణాలు వంటి ఎన్నోపథకాలు టీడీపీ అమలు చేసిందన్న విషయం ముస్లిం మైనార్టీలు గుర్తుపెట్టుకున్నారన్నారు. వేంపల్లెలో టీడీపీలో ముస్లింలు చేరడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇసుక, మద్యం, రోడ్డు పనుల్లో అవినీతితో డబ్బును సేకరించుకున్న పులివెందుల నాయకులు డబ్బులు పంచుతూ, ఎవరూ పార్టీ నుంచి బయటకు వెళ్లకుండా జాగ్రత్త పడుతున్నారని విమర్శించారు. అభద్రతా భావంతోనే డబ్బుల పంపిణీకి వారు తెరతీశారని విమర్శించారు. వైసీపీ పతనానికి సతీష్‌రెడ్డి అభిమానులు, బంధువులు, మిత్రులు, టీడీపీ శ్రేయోభిలాషులు కలిసిరావాలని విజ్ఞప్తి చేశారు. అందరినీ కలుపుకొని పార్టీ పటిష్టతకు కృషి చేయాలని, రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు షబ్బీర్, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ దర్బార్, జయచంద్రారెడ్డి, డివి సుబ్బారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆర్వీ రమేష్, మండల ఉపాధ్యక్షుడు భద్ర, మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి, జిల్లా ఉపాధ్యక్షులు రామగంగిరెడ్డి, గండి మాజీచైర్మన్ రాజారావు, బీసీ నాయకులు మడకా శ్రీనివాసులు, నామా వేమకుమార్ పాల్గొన్నారు.

రాజీవ్ కాలనీలో డీకేటీ పట్టాల దందా..

- ఆర్డీవోకు స్థానికుల ఫిర్యాదు



జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయం వద్దకు బాధితులు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 9: పట్టణంలో డీకేటీ పట్టాలను చౌకగా విక్రయిస్తున్నారన్న ప్రచారం నేపథ్యంలో శుక్రవారం గూడెం చెరువు, రాజీవ్ నగర్ కాలనీతోపాటు పట్టణానికి చెందిన పలువురు ఈ మేరకు ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. గుంతల్లోని చౌడేశ్వరి ఆలయం పక్క ఉన్న స్థలాలను రెవెన్యూ అధికారుల సహకారంతో కొందరు ఆక్రమించుకున్నారని, ఆలయానికి కేటాయించిన 29 సెంట్ల భూమిని సైతం ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని వారు ఆరోపించారు. ఆక్రమిత స్థలాల్లో నిర్మాణాలకు సైతం సిద్ధం చేసుకున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. బదిలీపై వెళ్లిన అధికారుల సాయంతో కొందరు డీకేటీ పట్టాలపై సంతకాలు చేయించుకుని విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పట్టణానికి చెందిన కొందరు ఇప్పటికే జమ్మలమడుగు రెవెన్యూ కార్యాలయంలో పని చేస్తున్నవారితో కలిసి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లించి పట్టాలు పొందినట్లు సమాచారం. ఈ విషయంలో ఓ బాధితుడు ఇప్పటికే రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. జమ్మలమడుగు పట్టణానికి చెందిన నలుగురు వ్యక్తుల వద్ద గూడెం చెరువుకు సంబంధించిన డీకేటీ పట్టాలున్నట్లుగా తెలుస్తోంది. ఈ విషయంపై జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ విషయంపై అధికారులు పరిశీలించి చర్యలు తీసుకుంటారని తెలిపారు. జమ్మలమడుగు డిప్యూటీ తహసీల్దారు వేణుగోపాల్ మాట్లాడుతూ పట్టా ఒరిజినల్ అయితే సంబంధిత వ్యక్తికి సమస్య ఉండదని, గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారుల పేర్లు చెప్పి దళారులు విక్రయించే పట్టాలు చెల్లవని స్పష్టం చేశారు. ఫేక్ పట్టాలను గుర్తించామన్నారు. వాటిని విక్రయించేవారిని ప్రజలు నమ్మరాదని తెలిపారు.

ఫ్లెక్సీల చించివేతపై జనసేన నేతల ఫిర్యాదు



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న జనసేన టీడీపీ నాయకులు

పెనగలూరు, ఫిబ్రవరి 9: మేమూ సిద్ధమే అన్న నినాదంతో మండలంలోని పలు ప్రాంతాలలో జనసేన నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేసిన వారిపై చర్యలు చేపట్టాలని జనసేన, టీడీపీ నేతలు గురువారం పెనగలూరు ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. నారాయణ నెల్లూరు నుంచి మండల కేంద్రం వరకు ఏడు చోట్ల తాము ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో రెచ్చగొట్టే వ్యాఖ్యాలు గానీ, మనోభావాలు తెబ్బతీసే పదాలుగానీ లేవని తెలిపారు. జనసేన పార్టీ ఎదుగుదల, మా నాయకుడి ఉన్నతిని ఓర్చుకోలేని వారే ఈ పని చేసి ఉంటారని తెలిపారు. జనసేన నాయకులు గొబ్బూరి హరిబాబు, నవీన్, సాయికుమార్, హరిప్రసాద్, శ్రీను, చక్రి, శివ, శ్రావణ్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొత్త బాలకృష్ణ, తెలుగు యువత జిల్లా కార్య దర్శి ఎన్.రాంప్రసాద్ నాయుడు, రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి షామీర్, నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి టి.ధనయ్య, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఎస్.మురళీ సీనియర్ నాయకులు వి.హరిప్రసాద్‌రెడ్డి, జేసీ సుబ్బయ్య, డాక్టర్ తులసి రామకృష్ణయ్య, తాళ్ల సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇదిఇలా ఉండగా శుక్రవారం ఉదయం 7 గంటలకు చించివేసిన ఫ్లెక్సీల స్థానంలో జనసేన నాయకులు మళ్లీ అవే ఫ్లెక్సీలను ఏర్పాటు చేయగా 11 గంటలకల్లా సింగనమల, ఓబిలి, నారాయణ నెల్లూరుల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మళ్లీ చించివేశారని. రెండవ దఫా కూడా ఫిర్యాదు చేశారు. .

పిచ్చికుక్కల స్వైర విహారం

- 30 మందికి గాయాలు



ఆస్పత్రిలో కుక్క కాటు బాధితులు

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 9: పట్టణంలో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేశాయి. శుక్రవారం ఒక్కరోజే మున్సిపాలిటీ పరిధిలోని పలు వీధుల్లో పిచ్చికుక్కలు దాడి చేసి 30 మందిని గాయపరిచాయి. వీరందరినీ హుటాహుటిన స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పట్టణంలోని శివానగర్, వెంకటయ్యనగర్, మహబూబ్‌నగర్, సుమిత్రానగర్, భావ నారాయణనగర్, గాంధీనగర్, శివరామక్రిష్ణానగర్, తెలుగుగంగ రోడ్డు, శ్రీనివాసపురం, విద్యానగర్, మార్తోమనగర్, సాయినగర్, నూర్‌బాష్‌కాలనీ, పూసలవాడ, సురేంద్రనగర్ తదితర డివిజన్‌లలో పిచ్చికుక్కల స్వైర విహారం చేశాయి. ఈ దాడిలో వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, గురప్ప, బాలయ్య, రవి, సిద్ధార్థ జాన్‌కేడీ, పట్టాభి, శ్రీనివాసులు, దస్తగిరి, షేక్ అహ్మద్, సురేష్, పర్వాణాతో పాటు మరికొంత మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరం దరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇటీవల కుక్కల దాడులతో ప్రజలు బయటికి రావాలంటేనే బెంబేలెత్తుతున్నారు. కుక్కల బెడదపై అనేకసార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బారి నుంచి కాపాడాలని కోరుతున్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరుకండి

- డీఈవో మారెడ్డి అనూరాధ

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 9: ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరుకావాలని జిల్లా విద్యాశాఖాధికారి మారెడ్డి అనూరాధ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ (రవణప్ప సత్రం) ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మెయిన్)లను డీఈఓ సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. భయాందోళనలు వీడి, సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ సకాలంలో సిలబస్‌ను పూర్తిచేసుకోవాలని సూచించారు. ఏకాగ్రత పెంచుకునేందుకు ఉదయాన్నే యోగా చేయాలని సలహా ఇచ్చారు. అనంతరం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పరీక్షలంటే భయం ఎందుకు.. విజయం నీదే అవగాహన కరపత్రాలు, ఆత్మహత్యారహిత సమాజంకోసం ప్రతిజ్ఞ చేద్దాం అనే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మెయిన్) ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరెడ్డి, ఇస్లాంపురం ఉర్దూ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి, జేవీవీ నాయకులు సనావుల్లా, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదవాలి



మాట్లాడుతున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప(రూరల్) ఫిబ్రవరి9 : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలని సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ సెక్రటరీ బాబాఫక్రుద్దీన్ సూచించారు. శుక్రవారం నగరంలోని మెయిన్ మున్సిపల్ హైస్కూల్‌లో బాండెడ్ లేబర్ నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ 1976లో భారతదేశంలో బాండెడ్ లేబర్ సిస్టమ్‌ను రద్దుచేయడానికి ది బాండెడ్ లేబర్ సిస్టమ్ అబాలిషన్ యాక్ట్ 1976 రూపొందించారన్నారు. వెట్టిచాకిరి నిర్మూలన, నిర్బంధ ఉచిత విద్య, చైల్డ్ లైన్ టోల్‌ఫ్రీ నెంబర్ 1098, 15100, చైల్డ్ రైట్స్, ప్రాథమిక హక్కులు, విధులు తదితర అంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ జిల్లా అధికారి జి. చెన్నారెడ్డి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వి.వి. సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతు ప్రయోజనాలే డీసీసీబీ లక్ష్యం



మెమొంటోలను అందజేస్తున్న డీసీసీబీ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి

కడప(రూరల్) ఫిబ్రవరి : రైతు ప్రయోజనాలే డీసీసీబీ లక్ష్యమని ఆ బ్యాంకు చైర్‌పర్సన్ ఝాన్సీరాణి తెలిపారు. కడప జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ 106వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శుక్రవారం కడపలోని ఆ సంస్థ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా రైతుల ప్రయోజనాలకు సహకార రంగంలో ఏర్పడిన తొలి బ్యాంకు కడప డీసీసీ బ్యాంకు అన్నారు. బ్యాంకు ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఉమ్మడి కడప జిల్లాలోని రైతులకు కావలసిన అన్ని రుణాలను అందిస్తున్నామన్నారు. అనంతరం కరెంటు, సేవింగ్స్ డిపాజిట్లు, టర్మ్ డిపాజిట్లలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన అధికారులు, ఉద్యోగులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్ఏ దుర్మరణం

- ముగ్గురికి తీవ్రగాయాలు



వీఆర్ఏ మృతదేహం

రామాపురం, ఫిబ్రవరి 9: రెండు స్కూటర్లు ఢీకొనడంతో కల్పనాయుని చెరువు వీఆర్ఏ తొట్టి సుబ్బరాయుడు (70) దుర్మరణంపాలు కాగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. రామాపురం మండలం కల్పనాయునిచెరువుకు చెందిన వీఆర్ఏ తొట్టిసుబ్బరాయుడు ఇంటి నుంచి నేదరపల్లి వైపు వెళుతుండగా, నేదరపల్లి నుంచి నీలకంఠ్రావుపేట వెళుతున్న స్కూటర్ ఢీకొంది. ఈ సంఘటనలో తొట్టి సుబ్బరాయుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో స్కూటర్‌పై ప్రయాణిస్తున్న తొట్టి సత్యనారాయణ, ఆయన భార్య వాణి, కుమారుడు శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డారు. రామాపురం పోలీసులు గాయపడిన వారిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. గాయపడినవారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎల్ వీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

మద్యం సీసాల స్వాధీనం

కాశినాయన ఫిబ్రవరి 9: మండలంలోని బాలాయపల్లెకు చెందిన పి. వెంకటయ్య నుంచి 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు కాశినాయన మండల ఎస్ఐ అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు.కొంతకాలంగా వెంకటయ్య గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో నిఘా పెట్టి శుక్రవారం పట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మైదుకూరు : మద్యం సీసాలు తీసుకెళ్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి కథనం మేరకు ఓ వ్యక్తి అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో, శుక్రవారం పట్టణంలోని తనిఖీలు చేస్తుండగా ఖాజాపీర్ అనే వ్యక్తి మద్యం సీసాలు తీసుకెళుతూ పట్టుబడ్డాడన్నారు. అతని నుంచి 53 బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 9: మండల పరిధిలోని వరిగ పాపిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ చౌటచెరువు సమీపంలో నారాయణ (53) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. చౌటచెరువుకు చెందిన నారాయణ ప్రతిరోజు మద్యం సేవిస్తూ తిరిగేవాడు. గురువారం మద్యం సేవించేందుకు రాయచోటి పట్టణానికి వచ్చిన నారాయణ తిరిగి ఇంటికి వెళ్లలేదు. దీంతో అతని భార్య భారతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే శుక్రవారం గ్రామానికి సమీపంలోని పొలాల్లో నారాయణ మృతి చెంది పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేశారు. మృతదేహాన్ని రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి కడప- పామూరు బస్సు సర్వీసు

మైదుకూరు, ఫిబ్రవరి 9: కడప రైల్వేస్టేషన్‌లో బొంబాయి - చెన్నై రైలుకు లింకుగా కడప - పామూరు బస్సు సర్వీసు ప్రారంభిస్తున్నట్లు డీఎం శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు మైదుకూరు నుంచి ఉదయం 4.45 గంటలకు బయలు దేరి రైలు వచ్చే సమయం ఉదయం 5.50లోగా కడప రైల్వే స్టేషన్‌కు చేరుతుందని, అక్కడి నుంచి 6 గంటలకు బయలు దేరి మైదుకూరు, పోరుమామిళ్ళ, సీతానగరం మీదుగా ఉదయం11.10 గంటలకు పామూరుకు చేరుకుంటుందని తెలిపారు. 11-30కి పామూరులో బయలు దేరి సాయంత్రం 5 గంటలకు కడప రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుందని వివరించారు. చెన్నై నుంచి బొంబాయికి వెళ్లే రైలు ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని, అలాగే రైల్వే స్టేషన్‌కు వెళ్ళే ప్రయాణికులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

16న సమ్మెను జయప్రదం చేయండి

వేంపల్లె, ఫిబ్రవరి 9: పరిశ్రమలు, సంఘటిత, అసంఘటిత, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికై ఈనెల 16న చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లా, భవననిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు.శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో సమ్మె కరపత్రాలు విడుదల చేశారు. ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దస్తగిరి, కోశాధికారి నాగేశ్వరావు, ట్రిపుల్‌ఐటీ సెక్యూరిటీ యూనియన్ ప్రధాన కార్యదర్శి బాబ్జాన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు కాంస్య పతకం


ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న హెచ్‌ఎం

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 9:మండలంలోని గంగనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పి.రెడ్డయ్య రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలలో కాంస్యపతకం సాధించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సావిత్రిదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు అండర్-14 రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచి కంస్యపతకాన్ని తమ విద్యార్థి రెడ్డయ్య సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా రెడ్డయ్యకు ప్రశంసాపత్రం అందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు శివశంకర్‌రెడ్డితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ప్రజలపై భారం మోపిన వైసీపీని గద్దె దింపాలి


కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి సుంకర శ్రీనివాస్, తుంగా రమణయ్య తదితరులు


మహిళలతో మాట్లాడుతున్న పుత్తా నరసింహారెడ్డి

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 9 :ప్రజలపై పెనుభారం మోపిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం 9వ డివిజన్‌లో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారితో పాటు జనసేన ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటరు సుంకర శ్రీనివాస్, తుంగా రమణయ్య పాల్గొని మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఒక్కసారి వైసీపీకి అధికారం ఇచ్చినందుకే ప్రజలపై పన్నులభారం మోపి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ, పార్టీ నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి, నరసింహారెడ్డి, గౌతం, రవిశంకర్‌రెడ్డి, సునీత, సుబ్బరాయుడు జనసేన, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీతో యువతకు భరోసా: పుత్తా

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 9 : బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీతో ఈ రాష్ట్ర యువతకు భవిష్యత్తుకు భరోసా ఉంటుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జంగంపల్లె, కొత్తపల్లె, అప్పయ్యపల్లె గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుగ్యారంటీ నిర్వహించారు. పుత్తా రాక సందర్భంగా గ్రామ ప్రజలు భారీ స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలు వివరించారు. ఈ కార్యక్రమంలోముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా, మాజీ ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మన్ జంపాల నరసింహారెడ్డి, తెలుగు యువత మాజీ జిల్లా అధ్యక్షుడు దివాకర్‌రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు వాసుదేవరెడ్డి, మండల కన్వీనరు రాఘవరెడ్డి, కంకర సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి, రామమునిరెడ్డి, బోయిళ్ల శంకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, మల్లేష్‌రాయల్, చెన్నక్రిష్ణరెడ్డి, చిన్న సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలం



స్పెషల్ క్యాంప్‌లో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

సీకేదిన్నె, ఫిబ్రవరి 9: పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలమని కేఎస్ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్‌ఎస్ మూర్తి తెలిపారు. కేఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏడు రోజుల ప్రత్యేక క్యాంపును కొప్పర్తి గ్రామంలో సర్పంచ్ సుజాత, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల కార్యాలయాల సమీపంలో పరిశుభ్రతను పాటిస్తూ చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని అదే విధంగా ఇళ్లలోని చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా నిర్ణీత ప్రదేశంలో వేసి పరిశుభ్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. ప్రజలు అధికారులకు సహకరించి స్వచ్ఛభారత్ లక్ష్యాన్ని నెరవేర్చాలన్నారు. ఈ సందర్భంగా కొప్పర్తిలోని పాఠశాల ఆవరణంలో రోడ్లకు ఇరువైపుల ఉన్న కంపచెట్లను తొలగించి చెత్తను శుభ్రం చేసి పరిసరాలను ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శుభ్రపరిచారు. అనంతరం విద్యార్థులు గ్రామస్థులను చైతన్యపరిచారు. కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సురేష్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్‌డే


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ సిద్దార్థ కౌశల్

కడప (క్రైం), ఫిబ్రవరి 9 : పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కోసమే శుక్రవారం జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు గ్రీవియన్స్‌డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసుస్టేషన్లు, ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది బదిలీలు, వ్యక్తిగత, స్పౌస్, చిల్డ్రన్స్ మెడికల్ సమస్యల గురించి జిల్లా ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. ఎస్పీ సిబ్బంది సమస్యలను విని, వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా కల్పించారు. సిబ్బంది ఫిర్యాదుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఆదేశించారు.

వారసత్వ రక్షణ బాధ్యత గురించి నేటి తరానికి చెబుదాం

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 9 : ప్రకృతి వారసత్వ సంపదను అందించారని, దాన్ని రక్షించుకోవడానికి నేటితరానికి వివరించాల్సిన బాధ్యత మనపై ఉందని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ తెలిపారు.శుక్రవారం ఆర్ట్స్ కళాశాలలో ఇంటాక్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు మై మాన్యుమెంట్ సెల్ఫ్ పేరిట విద్యార్థులకు పోస్టరు డిజైనింగ్ పోటీ నిర్వహించారు. ఇంటాక్ అన్నమయ్య సభ్యులు షేక్ అబ్దుల్లా, జిల్లా కో కన్వీనరు సుబ్బారెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, రాయలసీమ టూ రిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన్‌రాజు తదితరులు మాట్లాడారు.

'విద్యుత్‌ను ఆదా చేయండి'

కడప (చిన్నచౌకు), ఫిబ్రవరి 9 : విద్యుత్‌ను ఆదా చేయాలని సూపరింటెండెంట్ ఇంజనీరు ఎస్.రమణ పేర్కొన్నారు. శుక్రవారం కడప డివిజన్ విద్యుత్ కార్యాలయంలో కడప, సీకేదిన్నె, పెండ్లిమర్రి, వల్లూరు, చెన్నూరు మండలాల క్షేత్రస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క యూనిట్ విద్యుత్ కూడా వృథా కాకూడదన్నారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అవసరమైన ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు బిగించాలన్నారు. కడప ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎల్.నరసింహప్రసాద్ పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల ఆగడాలకు బ్రేకులు వేయాలి: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 9: ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా ఇప్పటికే ఓటమి భయంతో తీవ్ర మానసిక అశాంతికి గురౌతున్న కడప వైసీపీ నాయకుల ఆగడాలకు ప్రభుత్వం, జిల్లా పోలీస్ అధికారులు బ్రేకులు వేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ విభాగం కార్యదర్శి నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కడప నియోజక ఇన్‌చార్జ్ నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో వైసీపీని ప్రజలు శంకరగిరి మాన్యాలకు పంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మహిళ అనే ఇంకిత జ్ఞానం కూడా లేకుండా కొంతమంది ఇష్టానుసారంగా వాఖ్యలు చేస్తున్న తీరు బాధాకరమన్నారు. ఇలాంటి దుందుడుకు చర్యలను మానుకొని ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలన్నారు. టీడీపీ నాయకులు ఖాదర్‌బాష పాల్గొన్నారు.

ఎన్నికల డీఎస్సీ మాకొద్దు: ఏబీవీపీ

కడప (ఎర్రముక్కపల్లె) / నాగరాజుపేట, ఫిబ్రవరి 9 రాష్ట్రంలో మెగా డీఎస్సీ కోసం లక్షలాది మంది నిరుద్యోగులు ఎంతో కాలంగా ఎదురు చూస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కోసం డీఎస్సీ ప్రకటించడం సరికాదని.. ఎలక్షన్ డీఎస్సీ మాకొద్దని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లిఖార్జున డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ విడుదల చేయాలని ఆందోళన చేశారు.

దగా డీఎస్సీ కాదు... మెగా డీఎస్సీ కావాలి

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25వేల ఉపాధ్యాయ డీఎస్సీ పోస్టులను వెంటనే విడుదల చేయాలని డీవైఎఫ్‌ఐ మాజీ జిల్లా కార్యదర్శి మనోహర్, నగర కార్యదర్శి డీఎం ఓబులేసు డిమాండ్ చేశారు. డీఎస్సీ పోస్టులను 25వేలకు పెంచి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ పాత లెక్కల ప్రకారం సుమారు 25వేల పోస్టులు ఉండగా.. కేవలం 6000 పోస్టులకు కుదించిందన్నారు. జగన్ ప్ర భుత్వం తీరు మార్చుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

తుంగా రమణయ్యకు అభినందనల వెల్లువ


తుంగా రమణయ్యను అభినందిస్తున్న వడ్ల శ్రీనివాస్, తిరుమలయ్య తదితరులు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 9 : విశ్వప్రగతి చిట్‌ఫండ్స్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టరు, రియల్టర్ తుంగా రమణయ్యకు శ్రేయోభిలాషులు, మిత్రబృందం అభినందనలు తెలిపారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీలో చేరిన అనంతరం కడప నగరానికి తొలిసారిగా వచ్చిన సందర్భంగా వారి మిత్రబృందం చిట్‌ఫండ్స్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఉమ్మడి కడప జిల్లా ప్రజలకు జనసేన తరపున సేవ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టింబర్ గోపి, వడ్ల శ్రీనివస్, తిరుమలయ్య, తుంగా వెంకటేశ్, కిరణ్, కొండయ్య, మధు, తోట సుమన్, వనిత, కోలా మల్లి, శ్రీధర్, వేణు, బుజ్జితో పాటు పలువురు పాల్గొన్నారు.

దాడి కేసులో ఇరువురి అరెస్టు

కడప (క్రైం), ఫిబ్రవరి 9 :మాసీమబాబు సర్కిల్ సమీపంలో జరిగిన దాడి కేసులో ఇరువురిని అరెస్టు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు కడప నగరం 39వ డివిజనులో పీరుల్లాపై దాడి చేయడంతో ఆరిఫుల్లా, అతని తండ్రిపై కేసు నమోదు చేయగా, ఈ కేసుకు సంబంధించి వారి ఇరువురిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు పోలీసులు వివరించారు.

అధికారం కోసం అడ్డదారులు తొక్కుతున్న వైసీపీ

● ప్రేక్షకపాత్ర వహిస్తున్న పోలీసులు



మాట్లాడుతున్న గాలి చంద్ర

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 9 : జిల్లాలో గత వారం రోజులుగా వైసీపీ - టీడీపీ మధ్య పరస్పర దాడులు, వివాదాస్పద వ్యాఖ్యలు చోటు చేసుకుంటున్నాయని, అయినా కట్టడి చేయాల్సిన పోలీసులు తమకేం సంబంధం లేనట్లు వ్యవహరిస్తుండడం చాలా దారుణమని, అధికారం కోసం వైసీపీ అడ్డదారులు తొక్కుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముద్దనూరులో జరిగిన వైసీపీ, టీడీపీ ఘర్షణకు సంబంధించి ఒక ఎమ్మెల్యే సామాన్యులు వాడని పదాలతో మీడియా ముందు మాట్లాడడం వీధిరౌడీలా కార్యకర్తలను రెచ్చగొట్టడం సిగ్గుచేటన్నారు. ఆ సంఘటన జరిగిన వారం కాకముందే కడపలో పోలీసుస్టేషన్‌లోనే టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య వాగ్వివాదం, పరస్పర దాడులు చేసుకునే స్థాయికి రావడం, అయినా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం దారుణమన్నారు. దీన్ని బట్టి చూస్తే పోలీసులు అధికార వైసీపీ అడుగులకు మడుగులొత్తే ప్రయత్నం చేస్తున్నారని అర్థమవుతుందన్నారు. ప్రత్యర్థి పార్టీ నాయకులపై తప్పుడు పద్దతుల్లో బైండోవర్ కేసులు మోపే విధానాలను అవలంభిస్తూ పోలీసులు వైసీపీ ఏజంట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు తమ వైఖరి మార్చుకోవాలని అన్నారు. ప్రజల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గంగా సురేష్, సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు పాల్గొన్నారు.

'ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని సాగనంపాలి'

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 9: ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని సాగనంపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులురెడ్డి, ఏఐయూసీ కమలాపురం ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి తెలిపారు. ఈ నెల 16వ తేదీన దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం కమలాపురం మండల పరిషత్ కార్యాలయం ఎదుట కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు పరచకుండా కార్మిక రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. కరువు తుఫాను నష్టపరిహారాలను ఇన్‌పుట్ సబ్సిడీలను రైతులకు వెంటనే ఇవ్వాలని, రైతులందరికీ పంటల బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధగా సాగులో ఉన్న కౌలు రైతులకు, నష్టపరిహారాలు బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కరపత్ర ఆవిష్కరణలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మిదేవి, స్వాతి, వెంకటేశ్వరమ్మ, ప్రభావతి, అమ్ములు పాల్గొన్నారు.

డిల్లీలో వంగి వంగి దండాలు పెట్టడం కాదు..

రాష్ట్ర అభివృద్ధి కోసం పోరాడండి: డీవైఎఫ్‌ఐ

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 9 : విభజన హామీల కోసం పోరాటంలో నిర్లక్ష్యం వహించిన రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలకు రాబోవు ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ అన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం శుక్రవారం ఢిల్లీలో ఇంటర్నేషనల్ సెంటరులో ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో మాజీ సీబీఐ జేడీ లక్ష్మీనారాయణ అధ్యక్షతన చలసాని శ్రీనివాసరావు రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సదస్సుకు ఏపీ ప్రతినిధిగా పాల్గొని సీమకు పాలకులు చేస్తున్న నిర్లక్ష్యంపై మాట్లాడానన్నారు. రాయలసీమకు పాలకులు అన్యాయం చేస్తునే ఉన్నారన్నారు. విభజన సమయంలో కడప ఉక్కు ఇస్తామని బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామని చెప్పి నేటికి పది సంవత్సరాలు అవుతున్నా అతీగతీ లేదన్నారు. ఈ విషయంపై నిలదీయాల్సింది పోయి ఢిల్లీలో పోటీలు పడి అమిత్‌షా, మోదీలకు వంగి వంగి దండాలు పెట్టడం సిగ్గుచేటన్నారు. బీజేపీకి మద్దతినిస్తున్న ఆయా పార్టీలకు రాబోవు ఎన్నికల్లో యువత ప్రజలు తగిన రీతిలో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

'బీసీ గర్జనను విజయవంతం చేయండి'

చెన్నూరు, ఫిబ్రవరి 9 : బీసీ గర్జనను విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం చెన్నూరు టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కమలాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 12న బీసీ గర్జనను నిర్వహించనున్నట్లు తెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తే బీసీలకు రక్షణ చట్టం తెస్తామని మేనిఫెస్టోలో ఇప్పటికే పేర్కొన్నారన్నారు. అంతేకాక 2014-19 మధ్యకాలంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో బీసీల కోసం ఎన్నో సంక్షమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత టీడీపీదేనన్నారు. టీడీపీ కోసం బీసీలంతా తరలిరావాలన్నారు. మండల బీసీ నేతలు టీడీపీ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి వేల్పుల సుబ్రమణ్యం కొక్కిరాయపల్లె సర్పంచ్ సూర్యనారాయణ, శివాలపల్లె టీడీపీ సీనియర్ బీసీ నాయకులు శ్రీనివాసులు, బెస్త సాధికారసమితి రాష్ట్ర కార్యవర్గసభ్యులు మల్లే సుబ్బయ్య, మండల బీసీ సెల్ నేత సంజీవ్ పవన్‌కుమార్, బీసీ సెల్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఆటో బాబు, మాకం భరత్ తదితరులు పాల్గొన్నారు.

45 అసెంబ్లీ, 7 లోక్ సభ స్థానాలు కేటాయించాలి: పీసీసీ

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 9: రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు 45 అసెంబ్లీ, 7 పార్లమెంట్ స్థానాలను కేటాయించాలని పీసీసీ మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహమ్మద్ అలీఖాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో జరిగిన సమావేశంలో ఏఐసీసీ మైనార్టీ సమన్వయకర్తలకు అలీఖాన్ వినతిపత్రం అందజేశారు.

'స్కౌట్ ఎన్నికలను రద్దు చేయాలి'

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 9 : స్కౌట్ ఎన్నికలను రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం డీఆర్వోకు వారు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, ఎస్‌ఎఫ్‌ఐ సునీల్ మాట్లాడుతూ స్కౌట్ ఎన్నికలకు సంబంధించి డీఈఓగా ఉన్న రాఘవరెడ్డి భారత స్కౌట్, విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్నికలు జరపాలని ఆదేశించడం జరిగిందన్నారు. అయితే గత డీఈఓగా బాధ్యతలు నిర్వహించిన రాఘవరెడ్డి జనవరి 4న నోటిఫికేషన్ ఇచ్చి 6న ఎన్నికలు నిర్వహించారన్నారు. కానీ సభ్యులకు ఎలాంటి కారణం తెలపకుండా పలుమార్లు వాయిదావేసి ఇప్పుడు జరపడం నిబంధనలను తుంగలో తొక్కడమేనన్నారు. నిబంధనల ప్రకారం స్కౌట్‌ఎన్నికలు జరపాలన్నారు. అదీ జిల్లా కలెక్టరు సమక్షంలో నిఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు చంద్ర, అఖిరానంద్, తేజ పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం - పట్టించుకోని అధికారులు


ఆజాద్ నగర్‌లో సంచరిస్తున్న పందులు

సీకేదిన్నె, ఫిబ్రవరి 9: అధికారులు పట్టించుకోకపోవడంతో పారిశుధ్య వ్యవస్థ అధ్వాన్నంగా మారింది. దీంతో ప్రజలు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో అపరిశుభ్రత తాండవిస్తోంది. దుర్వాసన వెదజల్లుతుండడంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేం ద్రమైన చింతకొమ్మదిన్నె పంచాయతీలో చెత్త పంచాయతీలోని ఆజాద్‌నగర్ ప్రాంతంలో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయి పందులకు నివాసాలుగా మారుతున్నాయి. దీంతో ప్రజలు ఆ దారిన వెళ్లాలన్నా భయపడుతున్నారు. పందులు వృద్ధులు, చిన్నారులపై దా డిచేసిన సందర్భాలు కూడా ఉన్నాయని స్థానికులు వాపోతున్నాయి. అయినప్పటికి అధికారులు పట్టించుకోకపోవడంతో నిత్యం దుర్వాసనతో సహవాసం చేయాల్సి వస్తోంది. మరోవైపు మురుగు నీరు పోయేందుకు కాలువలు సక్రమంగా లేక దోమలకు నిలయాలుగా మారి వ్యాధుల భయంతో అల్లాడుతున్నారు. పంచాయతీ అధికారులు కానీ, వైద్య సిబ్బంది కానీ ప్రజల వైపు కన్నెత్తి చూడలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమీపంలో వృద్ధాశ్రమం ఉండడంతో పందుల దెబ్బకు వృద్ధులు ఎక్కడ దాడి చేస్తాయోనని భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా చెత్తను తొలగించి సమస్య లేకుండా చూడాలని కోరుతున్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్‌గా రాజేష్‌చంద్ర



కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 9 : కడప మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనరుగా కూచిపూడి రాజేష్‌చంద్ర బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయం తన చాంబరులో బాధ్యతలను స్వీకరించారు. గ్రూప్-1 ఫలితాల్లో గత సంవత్సరం మున్సిపల్ కమిషనరుగా ఎంపికయ్యారు. ప్రస్తుతం అడిషనల్ కమిషనరుగా తనను ప్రభుత్వం నియమించారు. కడప అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ వైస్ చైర్మన్ ఓబులేసు నందన్, జిల్లా సహాయ ఆడిట్ అధికారి శ్యా మ్యూల్ డెన్నీతో పాటు పలువురు అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు అడిషనల్ కమిషనరును అభినందించారు.

గురజాలలో బీజేపీ 'పల్లెకు పోదాం'

సింహాద్రిపురం, ఫిబ్రవరి 9:పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గురజాల గ్రామంలో శుక్రవారం పల్లెకు పోదాం కార్యక్రమం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరిస్తూ, ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురజాల మాజీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, వీడియో కన్వీనర్ భానుప్రకాష్‌రెడ్డి, అప్పస్వామి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

భూపేశ్ పాదయాత్రను విజయవంతం చేయండి

● మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి పిలుపు



జమ్మలమడుగు, ఫిబ్రవరి 9: జమ్మలమడుగులో టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి కడప ఉక్కు కోసం పాదయాత్ర చేస్తున్నట్లు పాదయాత్రలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, నిరుద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో జమ్మలమడుగు మండల కార్యకర్తలకు సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఈ నెల 10వ తేదీ శనివారం ఉదయం నుంచి జమ్మలమడుగు నారాపురం వేంకటేశ్వరస్వామి వద్ద పూజలు ఉక్కు శిలాఫలకం వద్దకు భూపేశ్‌రెడ్డి పాదయాత్ర చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కడప ఉక్కు, మన హక్కు అనే సంకల్పంతో శనివారం ఉదయం ఏడు గంటలకు పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. అనంతరం పెద్దదండ్లూరులో సాయంత్రం అయిదు గంటలకు బహిరంగ సభ ఉంటుందని ఆయన తెలిపారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, నాయకులు పొన్నతోట శ్రీనివాసులు, కొండయ్య, గౌస్‌మొద్దీన్, బాలపుల్లారెడ్డి, కేకే ఖదీర్, ధనుంజయ, జి.కె.గైబు, దాడిశెట్టి శ్రీను, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా స్వామ్యానికి పాతర వేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

11న పౌరహక్కుల సంఘం జిల్లా మహా సభలు విజయవంతం చేయండి

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 9 : పౌరులకు రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాలరాస్తూ ప్రజాస్వామ్యానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పాతర వేస్తున్నాయని పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయకార్యాదర్శి చీమలపెంట వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం హోమస్‌పేటలోని సృజనా సామాజిక వేదిక కార్యాలయంలో ఆదివారం రాయచోటిలో జరిగే పౌరహక్కుల సంఘం జిల్లా మహాసభల కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మీ,సృజనా సామాజిక వేదిక కన్వీనర్ శ్రీను, ఆర్‌వీఎస్ కన్వీనర్ హరితా, రమణారెడ్డి పాల్గొన్నారు.

15 లోపు రైతులు ఈ-క్రాప్ చేయించుకోవాలి

కొండాపురం, ఫిబ్రవరి 9 : రబీలో సాగు చేసిన పంటలను ప్రతి రైతు ఈ నెల 15 లోపు ఈ-క్రాప్ చేయించుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకుడు వెంకటసుబ్బయ్య తెలిపారు. మండలంలోని సిబ్బందితో శుక్రవారం కొండాపురం ఆర్‌బీకేలో సమావేశం నిర్వహించారు.ఈ-క్రాప్ చేయించుకుంటేనే ప్రభుత్వపథకాలు వర్తిస్తాయని రైతులకు తెలపాలని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏవో రామాంజులరెడ్డి, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో దగా పడ్డ బడుగులు







ప్రొద్దుటూరులో ప్రచారం నిర్వహిస్తున్న వరదరాజులరెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పోరుమామిళ్లలో ప్రచారం చేస్తున్న బొజ్జ రోశన్న

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 9 : జగన్ ప్రభుత్వంలో బడుగు బలహీనవర్గాలకు నిధులులేని కార్పొరేషన్లు పెట్టి దగా చేశారని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కొత్తపల్లె పంచాయతీ మత్స్యకాలనీ, టీచర్స్ కాలనీ ఏరియాలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కడప టీడీపీ పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, వార్డుమెంబరు ఇస్మాయిల్, మాజీ ఎంపీటీసీ పేట రమణ, ఖదీర్, ద్వారక నాథ్‌రెడ్డి ,బి.నాగ భూషణాచారి, ఆసం మల్లికార్జునరెడ్డి మెహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు వద్దిబాలుడు, మార్తలగురివిరెడ్డి, ద్వార్శల రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: వైసీపీని వచ్చేఎన్నికల్లో ఓడించడానికి టీడీపీ సిద్ధంగా వున్నదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం 2 వవార్డు లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బాబులరెడ్డి, బండిభాస్కర్‌రెడ్డి తాటిశ్రీను యాదవ్, మిట్ట బాలచరణ్‌కుమార్, ఆవుల దస్తగిరి పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను బద్వేలు టీడీపీ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న పంపిణీ చేశారు. శుక్రవారం పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలోని రెడ్డినగర్ ప్రధాన రహదారుల్లో ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కల్వకూరి చిన్న వెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకులు సీతా వెంకటసుబ్బయ్య, ఇమాంహుసేన్, ఎంపీటీసీ కల్వకూరి రమణ, డ్రైవర్ ఎస్‌ఎంబాషా, సంచర్ల మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, పెద్దిరెడ్డి వెంకటరెడ్డి, బండి ఓబులేసు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు టౌన్..: బద్వేలులో టీడీపీ గెలుపు ఖాయమని బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలవలి వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 18వ వార్డు పూసలవాడలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి టీడీపీ పథకాలు వివరించారు. ఈ కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, గురుబ్రహ్మం, మహేష్, నారాయణ, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

మైలవరం..: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి సతీమణి జ్యోతి, తల్లి సరస్వతి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎం.కంబాలదిన్నె గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో బాగంగా ఇంటింటికి తిరుగుతూ టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కొండయ్య, పాపిరెడ్డి, సూర్యపెద్దిరాజు, శివమ్మ, మరియమ్మ, లక్ష్మీదేవి, అరుణ, రమణమ్మ, సుబ్బలక్ష్మి, నాగేంద్రమ్మ, సుభాషిణి, శివమ్మ, నరసయ్య, జాషువ తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారంటీ ఉంటుందని బొజ్జ అరుణ, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తిరువెంగళాపురం గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసా, మండల పార్టీ అధ్యక్షుడు బసిరెడ్డి రవికుమార్‌రెడ్డి, భూమిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, రాజారెడ్డి, నాగభూషణం, రమణయ్య, సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, నాగరాజు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

తెల్లపాడులో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ

కలసపాడు..: మండలంలోని తెల్లపాడు పంచాయతీలో బద్వేలు నియోజకవర్గ ఇన్‌చార్జి రోశన్న ఇంటింటికీ టీడీపీ కరపత్రాలు పంపిణీ చేశారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీలో భాగంగా శుక్రవారం తెల్లపాడు పంచాయతీలో ఆయన పర్యటించి టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బద్వేలు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రంతుల్లా, మండల పార్టీ అధ్యక్షుడు జి.వెంకటరామిరెడ్డి, ఉపాధ్యక్షులు పట్టాభిరెడ్డి, బి.భద్రయ్య, నాగేశ్వర్‌రావు, దుగ్గిరెడ్డి, నారాయణరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రోశిరెడ్డి, సత్యం, రామాంజనేయరెడ్డి, సోమిరెడ్డి, రసూల్ కార్యకర్తలు పాల్గొన్నారు.

దువ్వూరులో జనసేన ఆత్మీయ సమావేశం

దువ్వూరు (మైదుకూరు), ఫిబ్రవరి 9 : మైదుకూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం దువ్వూరులో శుక్రవారం నిర్వహించారు. ఇటీవల పార్టీలో చేరిన పాశం లక్ష్మీనరసయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీని బలోపేత చేయాలన్నారు. అధికార పార్టీలో వ్యతిరేకులందరినీ జనసేనలో చేర్చుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నాయకులు రామ్మోహన్, నాయకులు కల్నల్ కందనూరు గోపి, గోశెట్టి చిలుంగారి క్రిష్ణ మూర్తి పాల్గొన్నారు.

వాహనదారులు అప్రమత్తంగా వ్యవహరించాలి

బద్వేలు, ఫిబ్రవరి 9: ప్రయాణాలు చేసే సమయంలో వాహనదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, కారులో వెళ్లే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని, అలాగే మోటారు బైక్‌లపై వెళ్లేవారు హెల్మెట్లను తప్పక ధరించాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మేరా ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన సదస్సు నుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఏదైనా ప్రమాదం సంభవించినపుడు గోల్డెన్ అవర్‌లో పేషంట్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రాణాలను కాపాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ వి.శేఖర్‌రావు, సీఐ యుగంధర్, ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన సదస్సు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 9: జమ్మలమడుగులోని ప్రభుత్వ, బాలికల జూనియర్ కళాశాల ఆవరణంలో శుక్రవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్యంపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషర్ ప్రమోద్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శాంతికళ హాజరయ్యారు. అనంతరం బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, డాక్టర్ తాహీరా, కోఆర్డినేటర్ శ్రీనివాసులు, రాష్ట్రీయ కిశోర స్వస్తియా కార్యక్రమం కౌన్సిలర్ బాల గురప్ప, ఆశా వర్కర్లు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బీసీల న్యాయమైన కోరికలు నెరవేర్చాలి

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 9 : బీసీల న్యాయమైన కోరికలు నెరవేర్చాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి గురుమూర్తి అన్నారు. శుక్రవారం పోరుమామిళ్లలోని వివేకానంద భవనంలో బీసీల న్యాయమైన కోరికల సాధన కోసం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కమిషన్ రిపోర్టును యథాతథంగా అమలు చేయాలన్నారు. బద్వేలు పట్టణంలో బీసీ భవనానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలన్నారు. ఆలిండియా దోబీ మహాసంఘ్‌రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రిష్ణయ్య, బొజ్జ కొండయ్య, రాజగోపాల్, చిన్న రామయ్య, అమీన్‌షాహిద్, గౌస్‌పీర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

బద్వేలు, ఫిబ్రవరి 9: బద్వేలు నియోజకవర్గ పరిధిలోని బద్వేలు, గోపవరం , అట్లూరు మండలాల పరిధిలోని 132/33 కేవీ, 33 కేవీ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరపరా నిలిపేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ కుళాయప్ప, ఏఈలు రమణ, చిన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించగలరని అనంతరం యథావిధిగా విద్యుత్ సరఫరా ఉంటుందని వారు తెలిపారు.

ఆర్టీపీపీలో కొనసాగుతున్న ధర్నా

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 9: ఒకటో తేదీనే జీతాలివ్వాలని ఆర్టీపీపీలో ఉద్యోగులు చేస్తున్న శుక్రవారం కూడా కొనసాగింది. ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా వారు పెద్దఎత్తున వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమకు న్యాయం జరిగేంతవరకు పోరాటం ఆపమన్నారు. ఇంత పెద్దఎత్తున ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని వారు విమర్శించారు. దాదాపు అన్ని యూనియన్ల సంఘాలు కలిసి ఈ ధర్నాలో పాల్గొంటున్నాయి.

గుడి ఉత్సవాలకు అడ్డంకి లేకుండా చర్యలు తీసుకోండి

టీడీపీ యువనేత రితీష్‌కుమార్‌రెడ్డి



జాతీయ రహదారి అధికారులతో చర్చిస్తున్న రితీష్‌కుమార్‌రెడ్డి

బద్వేలు, ఫిబ్రవరి 9 : జాతీయ రహదారి ప్రాజెక్టు డైరెక్టరును టీడీపీ యువనేత, మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ కుమారుడు రితీష్‌కుమార్‌రెడ్డి శుక్రవారం కలిశారు. జాతీయ రహదారిలో ఉన్న పలు సమస్యలను ప్రాజెక్టు డైరెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. చెన్నంపల్లెలో వెలసి ఉన్న ఆదిచెన్నకేశవస్వామి ఉత్సవాలు ప్రతి ఏడాది ఘనంగా నిర్వహిస్తున్నామని ఉత్సవాలు జరిగే సందర్భంగా రోడ్డు పనులు ఎలాంటి అడ్డంకి కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. త్వరలో ఉత్సవాలు ప్రారంభం అవుతాయని, నేషనల్ హైవే పనులు జరుగుతున్న దృష్ట్యా భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని రితీష్‌కుమార్‌రెడ్డి వారికి తెలిపారు. అలాగే గుంతపల్లె ప్రజల కోరిక మేరకు సబ్ స్టేషన్ వద్ద రోడ్డు దాటేందుకు సౌకర్యాలు కల్పించాలని ఆయన అధికారుల దృష్టికి తెచ్చారు. చెన్నంపల్లె దేవస్థానం పక్క నుంచే హైవేకు సంబంధించిన రహదారి వెళుతుండడంతో మార్చిలో ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయని ఉత్సవాలు తిలకించేందుకు చుట్టుపక్కల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఉత్సవాల సమయానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా తగు చర్యలు చేపట్టాలని రితీష్ రెడ్డి సూచించారు.

మున్సిపల్ చైర్మెన్‌ను కలసిన జనసేన



అమంచి స్వాములును సత్కరిస్తున్న చైర్మెన్ చంద్ర

మైదుకూరు, ఫిబ్రవరి 9 : మైదుకూరు మున్సిపల్ చైర్మెన్ మాచనూరు చంద్రను జనసేన రాయలసీమ ఇన్‌చార్జ్ అమంచి స్వాములు కలసి పార్టీలోకి ఆహ్వానించారు. చైర్మెన్ మాచనూరు చంద్ర వర్గం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిపై కొంతకాలంగా అసంతృప్తితో ఉన్నారు. కాగా శుక్రవారం సాయంత్రం జనసేన రాయలసీమ ఇన్‌చార్జ్ అమంచి స్వాములుతో పాటు మరి కొందరు చంద్ర నివాసానికి చేరుకొని జనసేన పార్టీలోకి ఆహ్వానించారు. అయితే చైర్మెన్ మాచనూరు చంద్ర ఆలోచించుకునేందుకు కొంత సమయం కావాలని కోరినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా అమంచి స్వాములును సత్కరించారు.

భూపేశ్ ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరికలు



ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 9: ఎర్రగుంట్ల మండలంలోని హనుమనగుత్తి గ్రామపంచాయతీ పరిధిలోని కేజీవీపల్లెలో శుక్రవారం సాయంత్రం 10కుటుంబాలు జమ్మలమడుగు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో చేరారు. రమణ, సుబ్బరాయుడు, వై.రమణ, పోతులూరు మారుతి, రవి, అంజనేయులు, మల్లికార్జున, చిన్న సుబ్బరాయుడు తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి సి.భూపేశ్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, మండల టీడీపీ బాధ్యులు మోహన్‌రెడ్డి, హనుమనగుత్తి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, చిన్న కొండారెడ్డి, కొండయ్య, ఈశ్వరరెడ్డి, జగదీష్, రామంజల్, జనార్దన్, మహేష్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తుంగా రమణయ్యకు ఘన సన్మానం



శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహానికి పూలమాల వేస్తున్న తుంగా రమణయ్య

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 9 : కడపకు చెందిన విశ్వప్రగతి చిట్‌ఫండ్స్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ తుంగా రమణయ్యకు బద్వేలు పట్టణంలోని బలిజ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘన సన్మానం చేశారు. అమరావతిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన తుంగా రమణయ్య కడపకు వెళుతున్న క్రమంలో శుక్రవారం బలిజ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ధర్మిశెట్టి వెంకటేశ్వర్లు, సురేంద్ర ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. నెల్లూరు రోడ్డులోని శ్రీకృష్ణ దేవరాయల విగ్రహానికి తుంగా రమణయ్య పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, సుబ్బారావు, భాస్కర్, శ్రీను, కేఆర్ గ్రూప్ అధినేత హరి, నాగరాజు, తుంగా నరసింహ, సుబ్బయ్య, నాగరాజు, అంకయ్య, వెంకటరమణ, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన లింగమయ్యస్వామి తిరుణాళ్ల

కొండాపురం, ఫిబ్రవరి 9 :మండలంలోని చౌటిపల్లె గ్రామంలో శుక్రవారం లింగమయ్యస్వామి తిరుణాళ్ల ముగిసింది.గురు,శుక్రవారాలలో జరిగిన ఈ తిరుణాళ్లకు జిల్లా నుంచే కాకుండా, ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు.తిరుణాళ్లలో భాగంగా లింగమ్యస్వామితో పాటు గ్రామ దేవతలు పెద్దమ్మ,అంకాళమ్మకు భక్తులు బోణాలు సమర్పించుకున్నారు.అదేవిధంగా కొంతమంది జంతుబలులు నిర్వహించి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు.రంగులరాట్నలు, అంగళ్లు ,చెరుకు విక్రయాలతో తిరుణాళ్ల లో సందడి కనిపించింది.ఎటువంటి అవాంఛానీయ సంఘటనలు జరగకుండా కొండాపురం ఎస్ఐ యోగీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.